# అనసూయ

## శ్రీమతి కామేశ్వరి.

ఆ. వె. అలరుగాదె ధాత్రి యందత్రిమునిజాయ
భవ్యనామధేయ పతివిధేయ
అతిథిభాగధేయ సుతగుణ సముదాయ
శ్రీయుతానసూయ శిష్టగేయ.

—అనసూయనాటకము.

అత్రియని ఒక మునీశ్వరుడు. అతనికి అనసూయ అను నామె పత్ని. ఆమె త్రికరణశుద్ధిగా పతియేదైవమని తలంచుచు అతని పాదసేవ ఏమరక చేయుచు ఆశ్రమమునకు వచ్చిన అతిథులను భక్తితో పూజించుచుండెను. ఇట్లుండగా త్రిలోకసంచారియగు నారదమునీశ్వరుండు ఒకనాడు అత్రిముని ఆశ్రమమునకు విచ్చేసెను. అనసూయ అతనికి అర్ఘ్యపాద్యము లొసంగి నమస్కరించెను. అచ్చట కొన్ని దినంబులుండి అనసూయ పతిభక్తికి బ్రాహ్మణభక్తికి అచ్చెరువంది ఆమెవద్ద సెలవుగైకొని నారదమునీశ్వరుండు దేవలోకమున కరిగెను.

నారదుడు కొండెములమారి. అనసూయతో సమానమైన పతివ్రత ముల్లోకములలో లేదని చాటి ఉమా, రమలకు చెప్పివారి గర్వ మడంచెద గాక యనితలచి నారదుడు స్వర్గలోకము కరిగి "అనసూయతో సమానమైన పతివ్రత ముల్లోకములలో లే"దని త్రిమూర్తుల సతులకుచెప్పెను. వారుమువ్వురును మనకు మించిన పతివ్రత భూలోకములోనున్నదా? యని గర్వముచే నారదునిచేతికి ఉక్కుశనగలిచ్చి, "మునీంద్రా! మీరు భూలోకమునకేగి అనసూయ కీ ఉక్కుశనగలిచ్చి, వీనిని నగముడుకునట్లు గుగ్గిళ్లుచేయించి తిరిగి వీనిని మావద్దకు తెచ్చియిం"డని చెప్పిరి.

నారదుడు వల్లె యని వానిని తీసికొని భూలోకమున కరగి ఉక్కుశనగలను అనసూయకిచ్చి "అమ్మా! ఈ ఉక్కుశనగలను దేవలోకమునుండి తెచ్చినాడను. నేను క్షుద్బాధ కోర్వలేకున్నాను కావున నాకీ శనగలను సగము ఉడుకునట్లు గుగ్గిళ్లుచేసి యిచ్చిన నాక్షుద్బాధతీర్చికొందు''నని చెప్పెను. "మునీంద్రా! మీకింత క్షుద్బాధగనున్నను దేవలోకమున నీశనగలను గుగ్గిళ్లుచేయువారు లేక పోయిరా? చిత్రము. ఇదిగో యిప్పుడే గుగ్గిళ్లనుచేసి తెచ్చి మీక్షుద్బాధ తీర్చెదను. అని లోని కరగి ఆశనగలను గుగ్గిళ్లుచేసి నారదునకిచ్చెను.

అతఁడు నాగుగ్గిళ్లందుకొని దేవలోకమున కరిగి త్రిమూర్తులపత్నులకు నాగుగ్గిళ్లను చూపెను. వారు అనసూయ పాతివ్రత్యమహిమ కచ్చెరువంది ఆమె గర్వ మణచవలెనని తలచిరి. త్రిమూర్తులు తమతమభక్తసంరక్షణార్థమై సంచారము వెడలియుండి తమ తమ నిలయములకు విచ్చేసిరి. త్రిమూర్తుల సతులు తమ పతులకు అనసూయ పాతివ్రత్యమహిమయు తాము ఆమె గర్వమడంచుటకు గాను నారదునిచే పంపిన ఉక్కుశనగిలను ఆమె గుగ్గిళ్లుచేసి యిచ్చుటయు మొదలగు వృత్తాంతము లెఱింగించిరి. త్రిమూర్తులు తమపత్నులకిట్లు చెప్పిరి. "అనసూయ మహాపతివ్రతాశిరోమణి. ఆమె గర్వమడంచ మన చేతగాదు." కాని వారు ముప్వురు నొకటే పట్టుదలకలవారు కావున, వారిమాట తప్పించుటకు త్రిమూర్తులకు సాధ్యముకానందులకు, వారితో, "సతీమణులారా! మీరిచట నేయుండుడు. మేముపోయి అనసూయ పాతివ్రత్యమును చెరచివచ్చెదమని చెప్పి ముప్వురును వారికి సమాధానముచెప్పి, త్రిమూర్తులు భూలోకమున అత్రి ఆశ్రమమున కరిగిరి.

త్రిమూర్తులు అనసూయవద్దకు వచ్చినప్పుడు తమరూపములమార్చి ఋషివేషధారులై వచ్చిరి. అనసూయ వీరినిచూచి అతిభక్తితో అర్ఘ్యపాద్యములొసంగి ముప్వురికిని నమస్కరించెను. ఆమె వారినందరి అతిథులవలె నాదరింపవలెనని తలచి అనసూయ, "విప్రోత్తములారా! మీరు చాలబడలినట్లున్నవారు. స్నానాహ్నికములన్నిట తీర్చుకొనివచ్చి నా ఆతిథ్యమును స్వీకరించి నన్ను ధన్యురాలిని చేయవలెనని కోరుచున్నా న"ని అనసూయచెప్పెను. త్రిమూర్తులయందు నారాయణు డనసూయతో నిట్లనెను.

"అమ్మా! మేముముప్వుర మొక వ్రతము సల్పుచున్నవారము. అది అతి కష్టమైనది. అదికొనసాగు వరకును మాకు భోజనము లేదు."

అన—మునీంద్రా! అదెట్టి వ్రతమో సెలవిండు.

నారా—తల్లీ! నీవతిథిపూజాసక్తవని మాకుతోచుచున్నది. నీవు మహాపతివ్రతవు. అది నీకెట్లు తెల్పుదును!

అన—ఋషివర్యా! మీరుత్రిమూర్తులవలె మాగృహమున కేతెంచి నాయింట భుజించక వెళ్లుట న్యాయమా? అట్లు మిమ్ము మరలపంపిన నాగృహిణీధర్మ మేమున్నది? మీవ్రతమున కేమి కావలయునో దయ చేసి సెలవిండు, నాప్రాణమైనను యిచ్చుదానను.

నారా—అమ్మా! ప్రాణమిచ్చుటకంటెను కఠినమైనదినుమా! నీమాటసత్యమేనా?

అన—స్వామీ! ముమ్మాటికి సత్యము.

నారా—అట్లయిన చెప్పెదను. కోపగించకుము. మేము శక్తినిపూజించువారము. ఆమె ఆజ్ఞవలననే యీమావ్రతము సల్పువారము. లేనియడల శక్తికి మహాగ్రహమువచ్చును. ఏమనగా సువాసినియగు నొక స్త్రీ వస్త్రవిహీనయై యన్నముపెట్టగా మేము భుజింపవలెను. ఇందులకు నిన్ను వేడుచున్నాము.

హా! హా! యనితలవాల్చి అనసూయ మరల ధైర్యమవలంబించి వారినిచూచి, "విప్రులారా! మీరు స్నానాహ్నికముల దీర్చుకొనిరండు." అనిచెప్పి వారుస్నానమున కరుగగా నామె తనపతికమండలువు హస్తమున చేసుకొని భగవంతునిట్లు ప్రార్థించెను.

"మానసంరక్షకా! నీవలనాడు దుర్యోధనుని సభయందు మానభంగమునకు దుఃఖించుచున్న పాంచాలిని రక్షించితివి. ఈ దినమున నీవు నాకు తోడ్పడుము. ఈవచ్చిన విప్రులు కపట వేషధారులైనయెడల నేనువస్త్రరహితనై వారికి అన్నము పెట్టునప్పుడు వారుముప్పురును శిశువులై పోదురుగాక."

త్రిమూర్తులు స్నానాది కృత్యముల దీర్చుకొనివచ్చి అనసూయ సిద్ధము చేసిన పీఠములపై కూర్చుండిరి. అనసూయ వారియాజ్ఞప్రకారము వస్త్రరహితయై వచ్చి తన పతిపాదములను ధ్యానించి పతికమండలువులోని నీరు ఆ బ్రాహ్మణులపై ప్రోక్షింపగా వారు తక్షణమే శిశువులైరి. అత్రిమునీశ్వరుండువచ్చి ఆ ముప్పురు శిశువులనుచూచి అచ్చెరువంది తన సతిచెప్పగా సమస్తవృత్తాంతమును కనుగొనెను. అనసూయ చర్యలకు అత్రిమునికి కల్గిన ఆశ్చర్యము యిచ్చట వ్రాయుటకు శక్యముకాదు.

భారతి, భార్గవి, భవానులు ముప్పురును తమపతులు శిశువులైనదిచూచి అనసూయపాదములకు నమస్కరించి

"అనసూయాదేవీ! మాకుపతిభిక్షపెట్టుము. మాకు పుట్టయిల్లు అత్తవారిల్లయినది." అని అతి దీనముతో వేడుకొనిరి.

వారి దీనాలాపములనువిని ఆ మునిదంపతులెంతయు కరుణించి త్రిమూర్తులను వేడుకొనగా వారు తమనిజస్వరూపమును అచ్చట నున్నవారికిచూపి, అత్రిఅనసూయలిరువురిని ఆశీర్వదించి తమతమ సతులను గైకొనిరి.

త్రిమూర్తులప్పు డనసూయనుచూచి "సాధ్వీమణీ! నీశీలమును మెచ్చితిమి. నీకీర్తిలోకమంతయు విస్తరించుగాక. మేముముప్పురము నీపుత్రులైతిమిగనుక మా అంశమున నీకీపుత్రునినిచ్చుచున్నా"మని, వారు దత్తాత్రేయుని అనసూయకిచ్చిరి. ఆమె, "మహాప్రసాదమని," దత్తాత్రేయుని స్వీకరించి తనపతితో అతి సుఖవతియైకాలముగడపుచుండెను. త్రిమూర్తులు వారివారి నివాసములచేరిరి.

మహాపతివ్రతామతల్లియగు అనసూయ త్రిమూర్తుల సతులగర్వ మడంచి తనమానము కాపాడుకొనుటయేగాక, యొక పుత్రుని బడసెను. సతీమతల్లి యగు అనసూయపాదారవిందములకు నమస్కరించి యీ చరితమునింతతో ముగించుచున్నదానను.